

దుర్గమ్మ సేవలో పీవీ సింధు

ఇంద్రకీలాద్రి: బ్యాడ్మింటన్ క్రీడాకారిణి పి.వి. సింధు బుధవారం దుర్గమ్మను దర్శించుకున్నారు. ఆమెకు ఆలయ ఈఓ కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు అందజేశారు.



సందడిగా బాలోత్సవం

మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ కళాశాల ఆడిటోరియంలో అమరావతి బాలోత్సవం బుధవారం సందడిగా కొనసాగింది. విద్యార్థులు సాంస్కృతిక ప్రదర్శనలతో అలరించారు.



గ్రామోత్సవం.. శోభాయమానం

చల్లపల్లి: స్థానిక అయ్యప్ప స్వామి క్షేత్రంలో పడి పూజను పురస్కరించుకుని బుధవారం గ్రామోత్సవాన్ని శోభాయమానంగా నిర్వహించారు. కాంతారా కళాకారుల నృత్యాలు ఆకట్టుకున్నాయి.

న్యూస్‌రీల్

వైఎస్సార్ హెల్త్ వర్సిటీ టీటీ జట్టు ఎంపిక



విజయవాడ స్పోర్ట్స్: దక్షిణ భారత అంతర విశ్వవిద్యాలయాల మహిళల టేబుల్ టెన్నిస్ పోటీలకు ప్రాతినిధ్యం వహించే డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య విశ్వవిద్యాలయం జట్టును ఎంపిక చేసినట్లు వర్సిటీ స్పోర్ట్స్ బోర్డ్ కార్యదర్శి డాక్టర్ ఇ.త్రిమూర్తి బుధవారం తెలిపారు. ఇటీవల నిర్వహించిన ఎంపిక పోటీల్లో అత్యంత క్రీడా నైపుణ్యం ప్రదర్శించిన పి.ఎస్.ఆర్.శ్రీసరజిత (జీఎస్ఎల్ డెంటల్ కాలేజీ, రాజమండ్రి), పి.నిత్యల (కోనసీమ మెడికల్ కాలేజీ, అమలాపురం), యు.ఆశ్విదితజయకుమార్ (ప్రభుత్వ డెంటల్ కాలేజీ, విజయవాడ), బి.సిందూరి (ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, చినకాకాని), సీహెచ్.శ్వేత (ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ, చినకాకాని) ఎంపికైనట్లు వివరించారు. చెన్నైలోని ఏఎంఈటీ యూనివర్సిటీలో ఈ నెల 22 నుంచి 24వ తేదీ వరకు జరిగే పోటీల్లో ఈ జట్టు పాల్గొంటుందన్నారు. ఈ జట్టుకు మేనేజర్‌గా ఎన్ఆర్ఐ మెడికల్ కాలేజీ పీడీ టి.గౌతమ్ వ్యవహరిస్తారన్నారు. జట్టుకు ఎంపికైన క్రీడాకారులను యూనివర్సిటీ వీసీ డాక్టర్ కె.బాబ్జి, రిజిస్ట్రార్ డాక్టర్ వి.రాధికారెడ్డి వర్సిటీ ప్రాంగణంలో బుధవారం అభినందించారు.

నిత్యాన్నదానానికి రూ.లక్ష విరాళం



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): శ్రీదుర్గా మల్లేశ్వర స్వామి వార్ల దేవస్థానంలో జరుగుతున్న నిత్యాన్నదానానికి విజయవాడకు చెందిన భక్తులు బుధవారం రూ.లక్ష విరాళాన్ని సమర్పించారు. మొగల్‌రాజపురానికి చెందిన మిక్కిలినేని విజయకుమార్ పేరిట మిక్కిలినేని శ్యామల రూ.లక్ష విరాళాన్ని ఆలయ ఈఓ కె.ఎస్.రామారావుకు అందజేశారు. అనంతరం దాతలకు ఆలయ మర్యాదలతో అమ్మవారి దర్శనం కల్పించారు. వేద పండితుల ఆశీర్వచనం అనంతరం దాతలకు ఈఓ అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, శేషవస్త్రాలను అందజేశారు.

దుర్గమ్మ సేవలో కార్మిక, పరిశ్రమల శాఖ కార్యదర్శి



ఇంద్రకీలాద్రి(విజయవాడపశ్చిమ): ఇంద్రకీలాద్రిపై కొలువై ఉన్న దుర్గమ్మను రాష్ట్ర కార్మిక, పరిశ్రమల శాఖ కార్యదర్శి ఎం.హరిజవహర్‌లాల్ బుధవారం దర్శించుకున్నారు. అమ్మవారి దర్శనానికి విచ్చేసిన హరిజవహర్‌లాల్ దంపతులకు ఆలయ అధికారులు, అర్చకులు ఆలయ మర్యాదలతో స్వాగతం పలికారు. అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు జరిపించుకున్న అనంతరం వేద పండితులు ఆశీర్వచనం, ఈఓ కె.ఎస్.రామారావు అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలు, పట్టువస్త్రాలను అందజేశారు.

వీఎంసీకి ఏపీ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డు



పటమట(విజయవాడతూర్పు): ఆంధ్రప్రదేశ్ స్టేట్ ఎనర్జీ కన్జర్వేషన్ అవార్డ్స్ (ఎస్ఈసీఏ) 2023లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ మొదటి స్థానంలో నిలిచింది. నగరంలోని హోటల్ వివంతలో బుధవారం జరిగిన అవార్డు ప్రదానోత్సవంలో ఏపీ జెన్‌కో ఎండీ- ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ కె.వి.ఎస్.చంద్రశేఖర బాబు నుంచి వీఎంసీ అదనపు కమిషనర్(ప్రాజెక్ట్స్) కె.సత్యవతి, చీఫ్ సివిల్ ఇంజినీర్ ఎం.ప్రభాకర్ రావు అవార్డు అందుకున్నారు. పరిశ్రమలు, భవనాలు, సంస్థల విభాగాలకు ఇచ్చిన ఈ అవార్డుల్లో విజయవాడ మునిసిపల్ కార్పొరేషన్ సమర్థవంతమైన ఇంధన ఆదా పద్ధతులను అమలు చేసినందుకు సబ్-కేటగిరీ 7 (స్థానిక సంస్థలు) విభాగంలో బంగారు అవార్డు పొందింది. సుస్థిర ఇంధన విధానాల్లో వీఎంసీ నిబద్ధత, ఇంధన పొదుపులో దాని ఆదర్శప్రాయమైన సహకారం అద్భుతమని ఏపీ జెన్‌కో ఎండీ- ఏపీ ట్రాన్స్‌కో జేఎండీ చంద్రశేఖరబాబు పేర్కొన్నారు.



గొల్లపూడిలో ముఖ్యమంత్రి పుట్టిన రోజు సందర్భంగా భారీ కేక్‌తో ర్యాలీ



కేక్ కట్ చేసి వేడుకలు నిర్వహిస్తున్న మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ తలశిల రఘురాం, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, ఎమ్మెల్సీ రుహుల్లా, అడపా శేషు తదితరులు

ఘనంగా జగనన్న జన్మదిన వేడుక

జననేత, ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదిన వేడుకలు విజయవాడ రూరల్ మండలం గొల్లపూడి గ్రామంలో బుధవారం కోలాహలంగా జరిగాయి. గురువారం ముఖ్యమంత్రి పుట్టిన రోజు కావడంతో సీఎం కార్యక్రమాల సమన్వయ కర్త, ఎమ్మెల్సీ తలశిల రఘురాం ఆధ్వర్యంలో 600 కిలోల కేక్‌ను ట్రాలీపై ఉంచి, గొల్లపూడి మైలురాయి సెంటర్ నుంచి వేలాది మంది ప్రజలు వెంట రాగా మేళ తాళాల నడుమ భారీ ఊరేగింపుగా పంచాయతీ కార్యాలయం వద్దకు చేరుకున్నారు. అక్కడ మంత్రి మేరుగ నాగార్జున, ఎమ్మెల్సీ రఘురాం, ఎమ్మెల్యే వెలంపల్లి శ్రీనివాసరావు, మేయర్ రాయన భాగ్యలక్ష్మి, ఎమ్మెల్సీ ఎండీ రుహుల్లా, కాపు కార్పొరేషన్ చైర్మన్ అడపా శేషు తదితరులు కేక్ కట్ చేసి సీఎం జగన్‌కు ముందస్తు జన్మదిన శుభాకాంక్షలు తెలిపారు.

–భవానీపురం(విజయవాడపశ్చిమ)

నాలుగున్నర ఏళ్లుగా సంక్షేమ పాలన

గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్



కంచడం గ్రామంలో సీసీ రోడ్ల శిలాఫలకాన్ని ఆవిష్కరిస్తున్న మంత్రి జోగి, ఎంపీ బాలశౌరి

బంటుమిల్లి(పెడన): రాష్ట్రంలో నాలుగున్నర ఏళ్లుగా ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఆధ్వర్యంలో గతంలో ఎన్నడూ లేని సంక్షేమ పాలన అమలవుతోందని గృహ నిర్మాణ శాఖ మంత్రి జోగి రమేష్ తెలిపారు. మండలంలోని కంచడం, ఆముదాలపల్లి గ్రామాల్లో బుధవారం జరిగిన అభివృద్ధి కార్యక్రమాల్లో మచిలీపట్నం ఎంపీ వల్లభనేని బాలశౌరితో కలసి మంత్రి పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయా గ్రామాల్లో జరిగిన సభల్లో మంత్రి జోగి రమేష్ మాట్లాడుతూ.. గతంలో ఏ ప్రభుత్వాలూ చేయని అభివృద్ధి పనులు, సంక్షేమ పథకాలను అందజేసిన ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి దక్కిందన్నారు. ఎంపీ బాలశౌరి మాట్లాడుతూ.. మచిలీపట్నంలో మెడికల్ కాలేజీ ఏర్పాటుతో తీర ప్రాంత ప్రజలకు వైద్య సేవలను ముఖ్యమంత్రి అందుబాటులోకి తెచ్చారని తెలిపారు. బందరు పోర్టు నిర్మాణంతో జిల్లా వాసుల చిరకాల వాంఛను నెరవేరుస్తున్న ఘనత వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికే దక్కిందన్నారు. కంచడంలో గడపగడపకు మన ప్రభుత్వం కింద మంజూరైన రూ.20 లక్షలు, ఎంపీ నిధులు రూ.9 లక్షలతో నిర్మించిన సీసీ రోడ్లు, ముఖ్యమంత్రి అభివృద్ధి నిధులు రూ.5 లక్షలతో నిర్మించిన కమ్యూనిటీ హాలు, ఆముదాలపల్లిలో రూ.40 లక్షలతో నిర్మించిన సచివాలయం, రూ.21.80 లక్షలతో నిర్మించి ఆర్బీకే భవనాలను మంత్రి, ఎంపీ ప్రారంభించారు. ఎంపీపీ వి.చినబాబు, జెడ్పీటీసీ ఎం.వెంకటరమణ, ఏఎంసీ చైర్మన్ కె.గంగాధర్, వైస్ ఎంపీపీ ఓ.చిన్నారిబాబు, సర్పంచ్ బండారు చంద్రశేఖర్, ఎంపీటీసీ సభ్యుడు పి.భగవాన్, ఏఎంసీ వైస్ చైర్మన్ పి.బాబూరావు, సుజ్ఞానం మహేష్, పీఏసీఎస్ చైర్మన్ గంధం శేషగిరి పాల్గొన్నారు.

సజావుగా ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): డాక్టర్ వైఎస్సార్ ఆరోగ్య శ్రీ స్మార్ట్ కార్డుల పంపిణీ ప్రక్రియ ఎన్టీఆర్ జిల్లాలో సజావుగా సాగుతోందని కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు బుధవారం ఓ ప్రకటనలో తెలిపారు. ప్రజలకు ఆరోగ్య భద్రతను హక్కుగా కల్పిస్తూ పేదలు, మధ్య తరగతి ప్రజలకు రూ.25 లక్షల వరకు ఉచిత వైద్యం అందించడం ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్నారు. కొత్త ఫీచర్లతో స్మార్ట్ ఆరోగ్య శ్రీ కార్డుల పంపిణీ కార్యక్రమాన్ని ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సోమవారం ప్రారంభించిన అనంతరం జిల్లాలో పంపిణీ చేపట్టామని పేర్కొన్నారు. గ్రామ/వార్డు సచివాలయాల పరిధిలోని లబ్ధిదారులకు ఈ కార్డులను పంపిణీ చేస్తున్నామని వివరించారు. నియోజకవర్గాల్లో స్థానిక ఎమ్మెల్యేలు స్మార్ట్ కార్డుల పంపిణీని ప్రారంభించారని తెలిపారు. వలంటీర్ల ద్వారా ఈ-కేవైసీ ఆధారంగా అత్యంత పారదర్శకంగా, జవాబుదారీతనంతో కార్డుల పంపిణీ జరుగుతోందని పేర్కొన్నారు. రాష్ట్ర ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా చికిత్సల సంఖ్యను 3,257కు, నెట్‌వర్క్ ఆస్పత్రుల సంఖ్యను 2,513లకు పెంచిందని వివరించారు. ఈ బృహత్తర కార్యక్రమంపై ప్రజలకు క్షేత్ర స్థాయి బృందాలు అవగాహన కల్పిస్తున్నాయని తెలిపారు. ఈ పథకాన్ని పూర్తిస్థాయిలో సద్వినియోగం చేసుకునేందుకు వీలుకల్పించే యాప్‌ను ప్రజలు తమ సెల్ ఫోనుల్లో డౌన్‌లోడు చేసుకునేందుకు సిబ్బంది సహకరిస్తున్నట్లు పేర్కొన్నారు. జిల్లాలో 79 నెట్‌వర్క్ ఆస్పత్రులు ఉన్నాయని కలెక్టర్ తెలిపారు. 2024, జనవరి ఒకటో తేదీ నుంచి ప్రారంభంకానున్న జగనన్న ఆరోగ్య సురక్ష-2 కార్యక్రమంపైనా అవగాహన కల్పిస్తున్నామని వివరించారు.

దరఖాస్తుల ఆహ్వానం

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర వెనుకబడిన తరగతుల సంక్షేమశాఖ ఆధ్వర్యంలో విజయవాడలోని బీసీ స్టడీ సర్కిల్‌లో ఏపీపీఎస్సీ గ్రూప్ -1, 2 అభ్యర్థులకు శిక్షణ ఇచ్చేందుకు అర్హులైన అధ్యాపకులు నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు ఒక ప్రకటనలో తెలిపారు. ఈ నెల 21వ తేదీ గురువారం లోగా దరఖాస్తు చేసుకోవాలని సూచించారు. అర్హులు తమ బయోడేటా, అనుభవం సర్టిఫికెట్‌తో పాటు దరఖాస్తులను ఈ నెల 21వ తేదీలోగా దరఖాస్తు చేసుకోవాలని, వివరాలకు 95050 94349, 9966 849937 సెల్ నంబర్లలో సంప్రదించాలని కోరారు.

ముగిసిన స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్



స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్ పోటీల్లో గెలుపొందిన జట్లు

పెనమలూరు: కృష్ణాజిల్లా కానూరు పీవీపీ సిద్ధార్థ ఇంజినీరింగ్ కాలేజీలో రెండు రోజులపాటు జరిగిన జాతీయ స్థాయి స్మార్ట్ ఇండియా హ్యాక్‌థాన్- 2023 బుధవారంతో ముగిసింది. ఈ పోటీల్లో 27 అగ్రశ్రేణి బృందాలు, 162 మంది విద్యార్థులు పాల్గొన్నారు. విద్యార్థులు నూతన ఆవిష్కరణలతో సత్తా చాటారు. తక్కువ ఖర్చుతో వివిధ ప్రాజెక్టులను రూపొందించి ప్రదర్శించారు. స్మార్ట్ ఎడ్యుకేషన్, డిజాస్టర్ మేనేజ్‌మెంట్, ఎంటర్‌టైన్‌మెంట్, బ్లాక్ చైన్, సైబర్ సెక్యూరిటీ తదితర అంశాల్లో విద్యార్థులు పోటీపడి మరీ తమ ప్రతిభను చాటి అభినందనలు అందుకున్నారు.

పోటీల్లో విజేత జట్లు ఇవే..

ఈ పోటీల్లో పాల్గొని ఉత్తమ ప్రదర్శన చూపిన ఐదు జట్లను ఎంపిక చేసి ప్రతి జట్టుకూ లక్ష రూపాయల చొప్పున నగదు బహుమతి, సర్టిఫికెట్లను ఏఐసీటీఈ ప్రతినిధి పలాష్ హసే ప్రకటించి విద్యార్థులకు అందజేశారు. గెలుపొందిన జట్లలో రాజస్తాన్‌కు చెందిన ఏరో వైన్, మహారాష్ట్రకు చెందిన జీడీఏ, కర్ణాటకకు చెందిన పెగసీస్, తెలంగాణకు చెందిన మెర్కిబీ 33, మహారాష్ట్రకు చెందిన కోడీ జట్లు గెలుపొందాయి. అదనపు ప్రైజ్ మనీగా తమిళనాడుకు చెందిన సీడ్‌షేర్ జట్టుకు రూ.50 వేలు అందజేశారు. ఈ కార్యక్రమంలో సిద్ధార్థ అకాడమీ కార్యదర్శి పాలడుగు లక్ష్మణరావు, ఇంజినీరింగ్ కాలేజీ ప్రిన్సిపాల్ డాక్టర్ కొండపల్లి శివాజీబాబు, నోడల్ సెంటర్ అధికారి పి.సాయికిరణ్, టెక్నికల్ హెడ్ డాక్టర్ వెంగల జగదీష్, పలువురు విద్యార్థులు పాల్గొన్నారు.

కళంకారీ.. కొత్తపుంతలు

- ప్రప్రథమంగా అచ్చులతో వస్త్రాలపై బొమ్మల ముద్రణ
- ట్రీ ఆఫ్ లైఫ్‌తో కలంకారీలో కొత్త పుంతలు ప్రారంభం
- తాజాగా వస్త్రాలపై అలరిస్తున్న రాధాకృష్ణుల చిత్రం
- త్వరలో అర్జునుడికి గీతోపదేశం చేస్తున్న శ్రీకృష్ణుడి బొమ్మ

పెడన: కలంకారీ వస్త్రాలు కొత్త పుంతలతో కళకళలాడుతున్నాయి. ఇప్పటి వరకూ కలంతో గీసిన, స్క్రీన్ ప్రింటింగ్ ద్వారా దేవుని బొమ్మలతో కనువిందు చేసిన ఈ వస్త్రాలు మరింత ఆధునికతను అందిపుచ్చుకున్నాయి. గతంలో అచ్చులు (బ్లాక్‌లు) ద్వారా రూపొందించిన పండ్లు, ఆకులు, చెట్లు, పూలు వంటి డిజైన్లకు పరిమితమైన కలంకారీ వస్త్రాలు ప్రయోగాత్మకంగా ట్రీ ఆఫ్ లైఫ్‌తో ఆధునికతను సంతరించుకున్నాయి. తాజాగా రాధాకృష్ణుల బొమ్మతో నూతన శోభను అద్దుకున్నాయి. కేవలం వాల్ హ్యాంగింగ్స్ కోసం ట్రీ ఆఫ్ లైఫ్ డిజైన్ రూపొందించారు. ఆ తర్వాత ట్రీ ఆఫ్ లైఫ్‌కు నేచర్ వర్షన్ తయారు చేశారు. అనంతరం మొఘల్ కాలం నాటి డిజైన్లతో కలంకారీకి కొత్త రూపు తెచ్చారు. తాజాగా సహజ సిద్ధ రంగులతో రాధాకృష్ణుల బొమ్మలను తీర్చిదిద్ది ఆధ్యాత్మికతను వస్త్రాలకు అద్దారు. అతి త్వరలో అర్జునుడికి శ్రీకృష్ణుడు గీతోపదేశం చేసే బొమ్మను కూడా అచ్చుల ద్వారా ముద్రించేందుకు ప్రణాళికలు సిద్ధం చేస్తున్నారు.

ట్రీ ఆఫ్ లైఫ్‌తో ఆధునిక హంగులు

కలంకారీ వస్త్రాలు ఆధునికతను సంతరించుకోవడం ట్రీ ఆఫ్ లైఫ్ డిజైన్‌తో ప్రారంభమైంది. ఈ డిజైన్‌ను రూపొందించడానికి అచ్చులు తయారు చేసే కళాకారులు మూడు నెలల సమయం తీసుకున్నారు. మొదట్లో చేసిన అచ్చులు సరిగ్గా రాకపోవడంతో నిరాశ చెందారు. కలంకారీ వస్త్ర ఉత్పత్తిదారులు ప్రోత్సహించడంతో మరింత పట్టుదలతో ట్రీ ఆఫ్ లైఫ్ అచ్చులను ఆకట్టుకునేలా రూపొందించారు. అచ్చుల తయారీకి మూడు నెలల సమయం పట్టగా, వస్త్రంపై ఆ డిజైన్‌ను ముద్రించేందుకు 14 రోజులు పట్టింది. ఈ డిజైన్‌లో పెద్ద చెట్టు, దాని నిండా కొమ్మలు, ఆకులు, పూలు, కాయలను ముద్రించారు. ఈ డిజైన్‌ను రూపొందించేందుకు పట్టిన అచ్చుల సంఖ్య 223.



రాధాకృష్ణుల డిజైన్



ట్రీ ఆఫ్ లైఫ్ నేచర్ వర్షన్

ట్రీ ఆఫ్ లైఫ్ నేచర్ వర్షన్

ట్రీ ఆఫ్ లైఫ్ డిజైన్‌లో ఉన్న చెట్టు, కొమ్మలు, ఆకులు, పూలు, కాయలతోపాటు పాలు తీసుకెళ్తున్న యువతి, గడ్డి మోసుకెళ్తున్న రైతు, పక్షులు, జంతువులు, ఇల్లు, ఇంటి ముందు ముగ్గు వంటి దృశ్యాలతో ట్రీ ఆఫ్ లైఫ్ నేచర్ వర్షన్‌ను రూపొందించారు. ఈ డిజైన్ కోస తయారు చేసిన అచ్చులు 212 మాత్రమే. ఈ డిజైన్ సైజు చిన్నది కావడంతో తక్కువ బ్లాక్‌లతో సరిపెట్టారు. ఈ బ్లాకులను తయారు చేయడానికి కూడా మూడు నెలలు సమయం పట్టింది. ముద్రించడానికి రెండు వారాలు సమయం తీసుకుంది. కరోనా ప్రభావం అధికంగా ఉండి, కళాకారులకు పనులు లేని సమయంలో వారికి ఉపాధి చూపి ఈ బ్లాకులు తయారు చేయించడం విశేషం.

మొఘల్ కాలం నాటి డిజైన్

మొఘల్ కాలం నాటి డిజైన్‌ను అచ్చుల ద్వారా కలంకారీ వస్త్రంపై ముద్రించారు. ఇందు కోసం 52 బ్లాకులను వినియోగించారు. తాజాగా రాధాకృష్ణులు ఉన్న బొమ్మను అచ్చులతో ముద్రించారు. ఈ అచ్చులు రూపొందించడానికి రెండు నెలలు సమయం తీసుకుంది. 110 బ్లాకుల ద్వారా ఈ డిజైన్‌ను రూపొందించారు. ముద్రించడానికి వారం రోజులు పట్టింది. ఈ డిజైన్లను కలంకారీ వస్త్రాలపై రూపొందించడానికి సహజ సిద్ధ రంగులను వాడుతున్నారు. రంగుల తయారీకి కరక్కాయ పువ్వు, నల్లకరక్కాయ చిన్నది, ఇనుము, ఉప్పునీరు, నల్లబెల్లం, దానిమ్మ కాయలు, మోదుగ పూలు, మంజిష్ట వేర్లు, నల్లకాసు, వక్కలు తయారు చేసే సమయంలో వెలువడే వ్యర్థ ద్రవం నుంచి చేసిన పొడి, ఇండిగో బ్లూ, కానికాయ, తుమ్మ చెట్టు బెరడు వాడుతున్నారు.

కలంకారీ కళపై ఆసక్తి ఉండాలి



కళను ప్రోత్సహించడమే కాదు దానిపై ఆసక్తి ఉండాలి. పిచ్చుక శ్రీనివాసరావుకు అవి రెండూ ఉన్నాయి. అచ్చుల తయారీ చాలా ఓర్పుతో కూడిన వ్యవహారం కావడంతో ఆయన ఎంతో తోడ్పాటు అందించారు. తొలుత ట్రీ ఆఫ్ లైఫ్ డిజైన్‌ను అచ్చులతో రూపొందించినా సరైన ఫలితం దక్కలేదు. శ్రీనివాసరావు నిరుత్సాహ పడకుండా మరింత తోడ్పాటు అందించడంతో మళ్లీ రూపొందించాం. డిజైన్ చక్కగా వచ్చింది. అనంతరం ట్రీ ఆఫ్ లైఫ్ నేచర్ వర్షన్, మొఘల్ కాలం నాటి డిజైన్, రాధాకృష్ణుల బొమ్మలను అచ్చులపై చెక్కాము. త్వరలో గీతోపదేశం దృశ్యం డిజైన్ రూపొందిస్తున్నాం. చాలా సంతోషంగా ఉంది.

– కోంద్ర గంగాధర్, నరసయ్య, జాతీయ అవార్డు గ్రహీతలు, పెడన

కళను బతికించాలనే తాపత్రయం



శ్యామలా ఆర్ట్ అండ్ క్రాఫ్ట్ కలంకారీ వస్త్ర ఉత్పత్తిదారుడిగా పెడనలో నివసిస్తున్నా. 40 సంవత్సరాలుగా కలంకారీ వృత్తినే నమ్ముకుని ఉన్నా. ఈ కళను బతికించాలనే తాపత్రయంతో అడుగులు వేస్తున్నా. వైఎస్సార్ సీపీ ప్రభుత్వానికి ముందున్న ఏ ప్రభుత్వమూ మమ్మల్ని గుర్తించలేదు. సీఎం వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి గుర్తించి గత ఏడాది వైఎస్సార్ ఎచీవ్‌మెంటు అవార్డు అందజేశారు. చాలా సంతోషంగా ఉంది. సహజసిద్ధ కలంకారీని బతికించాలనేది నా ప్రయత్నం. వాల్ హ్యాంగింగ్స్‌లో కొత్తగా అచ్చుల ద్వారా డిజైన్లు రూపొందించి ఈ కళను సజీవంగా ఉంచడానికి కృషి చేస్తున్నా.

– పిచ్చుక శ్రీనివాసరావు, వైఎస్సార్ ఎచీవ్‌మెంటు అవార్డు గ్రహీత, పెడన

పేద విద్యార్థుల విదేశీ విద్య కల సాకారం

- జిల్లాలో మొత్తం 24 మంది లబ్ధిదారులు
- రూ.2.59 కోట్ల మేర ఆర్థిక సాయం
- కృష్ణా జిల్లా కలెక్టర్ రాజాబాబు వెల్లడి

మచిలీపట్నంటౌన్: పేద విద్యార్థుల విదేశీ విద్య కలను రాష్ట్ర ప్రభుత్వం సాకారం చేస్తోందని కృష్ణా జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు అన్నారు. స్థానిక కలెక్టరేట్‌లోని వీడియో కాన్ఫరెన్స్ హాలులో విదేశీ విద్య దీవెన, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం పథకాల్లో లబ్ధిదారులకు బుధవారం ప్రోత్సాహకాలను కలెక్టర్ అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ప్రిలిమ్స్‌కు అర్హత సాధిస్తే లక్ష రూపాయలు, మెయిన్స్‌కు అర్హత సాధిస్తే మరో రూ.50 వేలు అందించేందుకు జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహక పథకాన్ని సీఎం ప్రారంభించారన్నారు. తాడేపల్లిలోని క్యాంపు కార్యాలయం నుంచి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి విదేశీ విద్యా దీవెన రెండో విడత నిధులు విడుదల, జగనన్న సివిల్ సర్వీసెస్ ప్రోత్సాహకం నూతన పథకాన్ని వర్చువల్‌గా ప్రారంభించారు. కలెక్టరేట్ వీసీ హాలు నుంచి అధికారులతో కలిసి కలెక్టర్ ఈ కార్యక్రమాన్ని వీక్షించారు. జిల్లాలో జగనన్న విదేశీ విద్య దీవెన పథకం ద్వారా ఈ ఏడాది 18 మంది అర్హులైన విద్యార్థులకు మూడో విడతగా రూ.1.77 కోట్లు, 2023-24 సంవత్సరానికి ఆరుగురు విద్యార్థులకు రెండో విడత రూ.81.59 లక్షల చొప్పున 24 మందికి రూ.2.59 కోట్లు విడుదల చేస్తూ చెక్కును కలెక్టర్ అందజేశారు. సివిల్ సర్వీసెస్ పరీక్షల్లో ప్రిలిమ్స్‌లో అర్హత సాధించిన ఎనిమిది మంది విద్యార్థులకు రూ.8 లక్షల చెక్కును అందజేశారు. ఈ కార్యక్రమంలో నగర డెప్యూటీ మేయర్ మాడపాటి విజయలక్ష్మి, సాంఘిక సంక్షేమశాఖ డెప్యూటీ డైరెక్టర్ షేక్ షాహిద్‌బాబు, జిల్లా గిరిజన సంక్షేమాధికారి ఫణిదూర్జటి, పలువురు విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, పలుశాఖల అధికారులు పాల్గొన్నారు.



లబ్ధిదారులకు చెక్కు అందజేస్తున్న కలెక్టర్ రాజాబాబు, అధికారులు, విద్యార్థులు, తల్లిదండ్రులు

కలలో కూడా అనుకోలేదు



నేను విదేశాల్లో చదువుతానని కలలో కూడా అనుకోలేదు. సీఎం జగనన్న అమలు చేస్తున్న జగనన్న విదేశీ విద్యా దీవెన పథకం వల్లే ఆస్ట్రియాలోని ఆర్ఎంఐటీ యూనివర్సిటీలో మాస్టర్ ఆఫ్ ప్రాజెక్టు మేనేజ్‌మెంట్ ఇంజినీరింగ్ కోర్సు చేస్తున్నాను. ఈ కోర్సుకు మొత్తం ఫీజు రూ.62 లక్షలు. మొదటి విడత రూ.15.53 లక్షలు జగనన్న విదేశీ విద్యాదీవెన పథకం ద్వారా మంజూరయ్యాయి. విదేశీ విద్యను సాకారం చేస్తున్న జగనన్నకు కృతజ్ఞతలు.

– రవిపూడి శ్రీకాంత్, సాయిపురం, ఉయ్యూరు మండలం

తరగతి గదుల్లో సాంకేతిక విప్లవం

- 2023-24 విద్యాసంవత్సరానికి ట్యాబ్‌లు సిద్ధం
- నేడు తొలి విడతగా విద్యార్థులకు అందజేత
- పామర్రులో లాంఛనంగా ప్రారంభం
- హాజరుకానున్న జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు

కంకిపాడు: విద్యార్థి దశ నుంచే సాంకేతిక పరిజ్ఞానం అందేలా ప్రభుత్వం అన్ని విధాలా చర్యలు తీసుకుంటుంది. అంతర్జాతీయ ప్రమాణాలతో విద్యార్థులు నైపుణ్యాలను సొంతం చేసుకునేలా విద్యాబోధనలో విప్లవాత్మక సంస్కరణలను చేపట్టింది. ఏటా సాంకేతిక పరిజ్ఞానంపై దృష్టి సారిస్తూ విద్యాభివృద్ధికి పెద్ద పీట వేస్తోంది. సాంకేతిక విజ్ఞానం అందించే క్రమంలో విద్యార్థులకు ట్యాబ్‌లను అందజేస్తుంది. విద్యాశాఖ పర్యవేక్షణలో జిల్లాలో ఈనెల 21న ట్యాబ్‌ల పంపిణీ జరగనుంది. ఈ మేరకు జిల్లా విద్యాశాఖ అన్ని ఏర్పాట్లు పూర్తి చేసింది.

ట్యాబ్‌ల పంపిణీకి సర్వం సిద్ధం....

వరుసగా ఈ ఏడాది కూడా బైజూస్ కంటెంట్ ఉన్న ట్యాబ్‌లను విద్యార్థులకు అందించేందుకు ప్రభుత్వం చర్యలు తీసుకుంది. ఈ ఏడాది కృష్ణా జిల్లాలోని వివిధ పాఠశాలల్లో 12131 మంది ఎనిమిదో తరగతి విద్యార్థులు ఉన్నారు. వీరికి తొలి విడతలో 6991 ట్యాబ్‌లను అందించేందుకు విద్యాశాఖ ఏర్పాట్లు చేసింది. ఇంకా 5140 మంది విద్యార్థులకు ట్యాబ్‌లు అందాల్సి ఉంది. మలి విడతలో మిగిలిన విద్యార్థులకు ట్యాబ్‌లను అందించేందుకు ఏర్పాట్లు జరుగుతున్నాయి.

నేడు పామర్రులో జిల్లా స్థాయి కార్యక్రమం...

జిల్లా స్థాయిలో ట్యాబ్‌ల పంపిణీ కార్యక్రమం పామర్రు జెడ్పీపాఠశాలలో గురువారం ఏర్పాటు చేశారు. ఉదయం 10 గంటలకు సభ ప్రారంభం కానుంది. సీఎం వైఎస్ జగన్ ట్యాబ్‌లను లాంఛనంగా అందించిన తరువాత జిల్లా స్థాయిలో పంపిణీ ప్రారంభించేందుకు అధికారులు సన్నాహాలు చేశారు. కార్యక్రమానికి జిల్లా కలెక్టర్ పి.రాజాబాబు, ఎమ్మెల్యే కొలుసు పార్థసారథి హాజరుకానున్నట్టు డీఈఓ తాహెరా సుల్తానా తెలిపారు.


ట్యాబ్‌లను అందజేస్తున్న అధికారులు

గతేడాది 12606 ట్యాబ్‌లు పంపిణీ....

గత విద్యాసంవత్సరంలో జిల్లా వ్యాప్తంగా ఎనిమిదో తరగతి చదువుతున్న 12606 మంది విద్యార్థులకు ప్రభుత్వం ట్యాబ్‌లను అందించింది. 2283 మంది ఉపాధ్యాయులకు ట్యాబ్‌లను సరఫరా చేసింది. ట్యాబ్‌ల ద్వారా బోధన, ట్యాబ్‌ల వినియోగంపై ఉపాధ్యాయులకు క్షేత్రస్థాయి శిక్షణలు ఇచ్చారు. అంతేకాకుండా నేర్చుకున్న పాఠ్యాంశాలకు సంబంధించి సందేహాలు నివృత్తి, కొత్త అంశాల పట్ల అధ్యయనం, తదితర అంశాలను ట్యాబ్‌ల ద్వారా విద్యార్థులు నేర్చుకున్నారు. ఈ ఏడాది కూడా అంతకంటే ఎక్కువ సాంకేతిక పరిజ్ఞానం విద్యార్థులకు అందించేందుకు అనుగుణంగా ట్యాబ్‌లను సిద్ధం చేశారు. ఎనిమిదో తరగతి పాఠ్యాంశాలతో పాటు ఇంటర్మీడియట్ పాఠ్యాంశాలు, అందుకు అవసరమైన కంటెంట్‌ను పొందుపర్చినట్లు విద్యాశాఖ అధికారులు చెబుతున్నారు.

సాంకేతికతతో విజ్ఞానం పెంపుదల



ప్రస్తుత పరిస్థితుల్లో చిన్ననాటి నుంచే సాంకేతిక పరిజ్ఞానం ఎంతో అవసరం. విద్యార్థులను అంతర్జాతీయంగా తీర్చిదిద్దేందుకే ఆంగ్ల మాధ్యమం, ట్యాబ్‌ల పంపిణీ వంటి విద్యా సంస్కరణలు ప్రభుత్వం చేపట్టింది. మంచిని గ్రహించి, చెడుకు దూరంగా ఉండటంతో తొలుత తల్లిదండ్రులు, తరువాత ఉపాధ్యాయులు బాధ్యత తీసుకోవాలి. అప్పుడే విద్యార్థులు ఎంచుకున్న లక్ష్యాలను సాధించగలరు. – తాహెరా సుల్తానా, డీఈఓ, కృష్ణాజిల్లా

అధునాతన పరిజ్ఞానం



ఎనిమిది, ఆ పై తరగతుల పాఠ్యాంశాలను సైతం ఈ దఫా ట్యాబ్‌లలో నిక్షిప్తం చేశారు. సాంకేతిక పరిజ్ఞానాన్ని సద్వినియోగం చేసుకుంటూ చదువులో రాణించేలా, ప్రతిభా పరీక్షల్లో సత్తా చాటేలా చేయటమే లక్ష్యం. ఈ ఏడాది ట్యాబ్‌ల పంపిణీకి ఏర్పాట్లు పూర్తయ్యాయి. విద్యార్థులు ట్యాబ్‌లను సద్వినియోగం చేసుకుని, చదువుల్లో రాణించాలి.

– మహమ్మద్ దావూద్ షేక్, జిల్లా నోడల్ అధికారి, కృష్ణాజిల్లా

క్లుప్తంగా

రేపు తైక్వాండో జాతీయ పోటీలు

విజయవాడ స్పోర్ట్స్: తైక్వాండో 38వ జాతీయ పోటీలను విజయవాడలోని చెన్నుపాటి రామకోటయ్య ఇండోర్ స్టేడియంలో ఈ నెల 22వ తేదీన నిర్వహిస్తున్నట్లు పోటీల నిర్వహణ కార్యదర్శి డి.వి.వి.ప్రసాద్ తెలిపారు. ఆంధ్రప్రదేశ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో మూడు రోజుల పాటు ఈ పోటీలు ఉంటాయని చెప్పారు. సబ్ జూనియర్, జూనియర్ బాలబాలికల, సీనియర్ స్త్రీ, పురుషుల విభాగాల్లో నిర్వహించే పోటీలకు 13 రాష్ట్రాల నుంచి 300 మంది క్రీడాకారులు ప్రాతినిధ్యం వహిస్తారని పేర్కొన్నారు. వ్యక్తిగత స్పారింగ్, గ్రూప్ స్పారింగ్, వ్యక్తిగత తుల్, గ్రూప్ తుల్ విభాగాల్లో క్రీడాకారులు తలపడతారని వెల్లడించారు. ఈ పోటీల్లో పతకాలు సాధించిన క్రీడాకారులు 2024 ఆగస్టు 22 నుంచి 24వ తేదీ వరకు విజయవాడలో నిర్వహించే ఏషియన్ ఓపెన్ చాంపియన్‌షిప్‌కు ప్రాతినిధ్యం వహిస్తారన్నారు.

అనుమానాస్పదస్థితిలో వృద్ధురాలి మృతి



పెడన:నందమూరు పంచాయతీ కోటవాని పాలెం గ్రామానికి చెందిన కాగిత నాగమణి (65) అనుమానాస్పదంగా మృతి చెందింది. వీఆర్వో కిషోర్ తెలిపిన వివరాల మేరకు... కోటవానిపాలెం నుంచి నందమూరు గ్రామానికి రావడానికి దగ్గర మార్గం చేపల చెరువు గట్లపై నుంచి వస్తుంటారని, ఇదే క్రమంలో ఒంటరి వృద్ధురాలు ఆ విధంగా వస్తూ చెరువులో పడి చనిపోయి ఉండవచ్చని తెలిపారు. వీఆర్వో పంచనామా నిర్వహించారు. ఘటనపై ఎటువంటి కేసు నమోదు కాలేదని పోలీసులు తెలిపారు.

సచివాలయ ఉద్యోగుల దినోత్సవంగా జరపాలి

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి జన్మదినోత్సవాన్ని గ్రామ, వార్డు సచివాలయ ఉద్యోగుల దినోత్సవంగా జరపాలని డెమొక్రటిక్ అసోసియేషన్ ఆఫ్ ఏపీ గ్రామ, వార్డు సచివాలయ ఎంప్లాయీస్ రాష్ట్ర అధ్యక్షుడు జి.జోసెఫ్ కుమార్ పిలుపునిచ్చారు. ఈ మేరకు ఒక ప్రకటన విడుదల చేశారు. సీఎం వైఎస్ జగన్ పుట్టిన రోజును పురస్కరించుకుని రాష్ట్రంలో అన్ని మండలాలు, మున్సిపాలిటీలు, కార్పొరేషన్లలో కేక్ కటింగ్ కార్యక్రమం నిర్వహించాలని సూచించారు. సీఎం వైఎస్ జగన్ ఫొటోతో రూపొందించిన కార్డును అన్ని వాట్సాప్ గ్రూపులు, ట్విట్టర్ ఖాతాల్లో పోస్టు చేయాలని కోరారు. ప్రకటన విడుదల చేసిన వారిలో వ్యవస్థాపక అధ్యక్షుడు నూతన్ కుమార్‌రెడ్డి, దుర్గాప్రసాద్, బి.సతీష్, ఎం.శేషుబాబు తదితరులు ఉన్నారు.

22 నుంచి జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన


వాల్‌పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మైనం హుస్సేన్, ఉపాధ్యాయులు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): జిల్లా విద్యా వైజ్ఞానిక ప్రదర్శన ఈ నెల 22వ తేదీ నుంచి రెండు రోజుల పాటు సింగ్‌నగర్ ఎంకే బేగ్ మున్సిపల్ హైస్కూల్ ప్రాంగణంలో నిర్వహిస్తున్నామని జిల్లా సైన్స్ అధికారి డాక్టర్ మైనం హుస్సేన్ తెలిపారు. వీటికి సంబంధించిన వాల్‌పోస్టర్‌లను ఆ పాఠశాల ఆవరణలో బుధవారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యా వైజ్ఞానిక ప్రదర్శనలకు సంబంధించిన కమిటీలను ఇప్పటికే ఏర్పాటు చేశామని చెప్పారు. ప్రతి మండలం నుంచి వచ్చిన ప్రాజెక్టుల నుంచి ఉత్తమమైన తొమ్మిది ప్రాజెక్టులను రాష్ట్ర స్థాయికి పంపుతామని తెలిపారు. ఇప్పటికే మండల స్థాయి పోటీలను దిగ్విజయంగా పూర్తిచేశామని పేర్కొన్నారు. జిల్లాస్థాయి ప్రదర్శనను కూడా విజయవంతం చేయాలని కోరారు.

'ఆడుదాం ఆంధ్రా' విజయవంతానికి సమష్టి కృషి


సీఎం వీడియో కాన్ఫరెన్స్‌లో పాల్గొన్న కలెక్టర్ ఢిల్లీరావు, అధికారులు, క్రీడాకారులు

ఎన్టీఆర్ జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు

గాంధీనగర్(విజయవాడసెంట్రల్): రాష్ట్ర ప్రభుత్వం అత్యంత ప్రతిష్టాత్మకంగా ఈ నెల 26 నుంచి వచ్చే ఏడాది ఫిబ్రవరి 10వ తేదీ వరకు నిర్వహించనున్న ఆడుదాం ఆంధ్రా క్రీడోత్సవాన్ని విజయవంతం చేసేందుకు పటిష్ట ఏర్పాట్లు చేస్తున్నట్లు జిల్లా కలెక్టర్ ఎస్.ఢిల్లీరావు తెలిపారు. ఆడుదాం ఆంధ్రా కార్యక్రమంపై రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి తాడేపల్లి క్యాంపు కార్యాలయం నుంచి అన్ని జిల్లాల కలెక్టర్లు, క్రీడాభివృద్ధి అధికారులు, స్పోర్ట్స్ అంబాసిడర్స్‌తో బుధవారం వీడియో కాన్ఫరెన్స్ నిర్వహించారు. జిల్లా కలెక్టరేట్ నుంచి కలెక్టర్ ఢిల్లీరావు, మున్సిపల్ కమిషనర్ స్వప్నిల్ దినకర్ పుండ్కర్, డీఎస్‌డీవో అజీజ్, జిల్లా స్పోర్ట్స్ అంబాసిడర్లు అనూష(సాఫ్ట్ టెన్నిస్), అబ్దుల్ రజాక్(ఫుట్‌బాల్)లతో కలిసి హాజరయ్యారు. క్రీడోత్సవాలను విజయవంతంగా నిర్వహించేందుకు అనుసరించాల్సిన కార్యాచరణపై ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి దిశానిర్దేశం చేశారు.

జిల్లాలోని 605 సచివాలయాల పరిధిలో క్రికెట్, వాలీబాల్, కబడ్డీ, ఖోఖో, బ్యాడ్మింటన్ క్రీడలతో పాటు స్థానిక ప్రాధాన్యమున్న క్రీడలకు సంబంధించిన పోటీలు నిర్వహించనున్నట్లు తెలిపారు. ఇందుకు సంబంధించి క్రీడాకారుల రిజిస్ట్రేషన్, మైదానాల ఎంపిక, టీమ్ ఫార్మేషన్, స్పోర్ట్స్ కిట్ల పంపిణీ తదితర ప్రక్రియను సజావుగా చేపట్టినట్లు వెల్లడించారు. క్రీడల నిర్వహణకు ప్రత్యేక అధికారులను నియమించామన్నారు. ఆడుదాం ఆంధ్రాలో జిల్లాకు గుర్తింపు తీసుకువచ్చేందుకు అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ ఆదేశించారు.

చేపల కనీస అమ్మకం ధరలపై తీర్మానం


ఆక్వా రైతుల సమావేశంలో మాట్లాడుతున్న ఉమాశంకర్ రెడ్డి

హనుమాన్‌జంక్షన్‌రూరల్: ఆక్వా రైతులు నష్టపోకుండా ఉండేందుకు సమష్టిగా కనీస అమ్మకం ధరను నిర్ణయించుకుని చేపలు విక్రయించాలని ఆక్వా రైతు సంఘం నాయకుడు కె.ఉమాశంకర్ రెడ్డి తెలిపారు. బాపులపాడు మండలం కానుమోలులోని యూఎస్ఆర్ ఆక్వా ఫీడ్స్ ఫ్యాక్టరీ ప్రాంగణంలో బుధవారం ఉమ్మడి కృష్ణా, పశ్చిమ గోదావరి జిల్లాల ఆక్వా రైతుల సమావేశం నిర్వహించారు. ఆక్వా రైతులు ఎదుర్కొంటున్న పలు సమస్యలపై చర్చించారు. ఫంగస్ చేపలు సాగు చేస్తున్న రైతులు నష్టపోకుండా ఉండేందుకు కనీస అమ్మకం ధరలను సమావేశంలో నిర్ణయించారు. చేపల ఫీడ్ ధరలు, చెరువు లీజు రేట్లు, నిర్వహణ ఖర్చులు పెరగడంతో చేపల అమ్మకం ధరలను పెంచక తప్పటం లేదని తెలిపారు. 1200 గ్రాముల బరువు కలిగిన ఫంగస్ చేపల కిలో ధర రూ.83 గానూ, 1500 గ్రాముల బరువు కలిగిన ఫంగస్ చేపల కిలో ధర రూ.85గా విక్రయించాలని ఆక్వా రైతులు ఏకగ్రీవంగా సమావేశంలో తీర్మానించారు. ఈ మేరకు ఆక్వా ట్రేడర్లు కూడా సహకరించాలని విజ్ఞప్తి చేశారు. ప్రస్తుతం కేజీ ఫంగస్ చేపల ధర రూ.65–71 మధ్య ఉండటంతో ఆక్వా రైతులు తీవ్ర సంక్షోభాన్ని ఎదుర్కొంటున్నామని, కేజీ చేప పెంపకానికి కనీస ఖర్చు రూ.85 అవుతుందని చెప్పారు. త్వరలో రాష్ట్ర స్థాయిలో ఆక్వా రైతుల సమావేశం ఏర్పాటు చేయదల్చినట్లు తెలిపారు. ఆక్వా రైతు నాయకులు పెద్దిరెడ్డి రాము, కేశవరావు, ఎలకపల్లి రవి, నారాయణ పాల్గొన్నారు.

లెప్రసీ రహిత జిల్లాగా నిలుపుదాం

డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని


లెప్రసీపై జరిగిన వర్క్‌షాపులో మాట్లాడుతున్న డీఎంహెచ్ఓ డాక్టర్ మాచర్ల సుహాసిని

లబ్బీపేట(విజయవాడతూర్పు): జిల్లాలో లెప్రసీని సమూలంగా నిర్మూలిద్దామని జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ మాచర్ల సుహాసిని అన్నారు. ఈ నెల 27 నుంచి జనవరి 12 వరకూ నిర్వహించనున్న జాతీయ లెప్రసీ నిర్మూలన కార్యక్రమంలో చేపట్టాల్సిన అంశాలపై ప్రోగ్రామ్ అధికారులు, వైద్యాధికారులు, నోడల్ అధికారులకు బుధవారం వర్క్‌షాపు నిర్వహించారు. అజిత్‌సింగ్‌నగర్ పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో నిర్వహించిన ఈ సదస్సులో డాక్టర్ మాచర్ల సుహాసిని మాట్లాడుతూ లెప్రసీ రోగిని కనుగొనే ప్రచార (లెప్రసీ కేస్ డిటెక్షన్ క్యాంపెయిన్) కార్యక్రమంలో ఆశా కార్యకర్తలు మేల్ వలంటీర్లు ఇంటింటికీ వెళ్లి అనుమానాస్పద లెప్రసీ లక్షణాలు ఉన్న వారిని గుర్తించాలని సూచించారు. అలాంటి వారిని ఏఎన్ఎంల పర్యవేక్షణలో ప్రాథమిక ఆరోగ్య కేంద్ర వైద్యాధికారుల వద్దకు తీసుకెళ్లి నిర్ధారించాలని చెప్పారు. అనంతరం వారికి చికిత్స అందిస్తామని పేర్కొన్నారు. ఈ కార్యక్రమాన్ని జిల్లాలో సమర్థవంతంగా నిర్వహించి నిగూఢంగా దాగివున్న కేసులను గుర్తించి చికిత్స అందించడం ద్వారా లెప్రసీ రహిత జిల్లాగా చేయాలని ఆమె పిలుపు నిచ్చారు. ఈ వర్క్‌షాపునకు జిల్లా ఎయిడ్స్ అండ్ లెప్రసీ, టీబీ అధికారి డాక్టర్ జె.ఉషారాణి అధ్యక్షత వహించారు. ఎస్ఎల్ఇపీ జాయింట్ డైరెక్టర్ దేవసాగర్, డీపీయంఓ ప్రతాప్, ఫిజియోథెరపిస్ట్ నాగలక్ష్మి పాల్గొన్నారు.




సందడిగా బాలోత్సవం



మొగల్రాజపురం(విజయవాడ తూర్పు): పీబీ సిద్ధార్థ ఆడిటోరియంలో జరుగుతున్న 6వ అమరావతి బాలోత్సవం రెండో రోజైన బుధవారం సందడిగా సాగింది. సీనియర్స్ విభాగం విద్యార్థులు చేసిన కోలాటం ఆకట్టుకుంది. జూనియర్స్ విభాగంలో విచిత్ర వేషధారణ, జూనియర్స్ లఘు నాటిక, సీనియర్స్ విభాగంలో క్లాసికల్, సీనియర్స్ దేశభక్తి గీతాలాపన, సబ్ జూనియర్స్ విభాగంలో కథలు చెప్పడం నిర్వహించారు. జూనియర్స్ పద్యం భావం చెప్పడం, తెలుగులో మాట్లాడడం, చిత్రలేఖనం, వ్యాసరచన, స్పెల్ బీ పోటీల్లో విద్యార్థులు ఉత్సాహంగా పాల్గొని వారిలోని ప్రతిభను చూపారు. ఎన్టీఆర్, కృష్ణా, గుంటూరు, ఏలూరు జిల్లాలోని పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఈ పోటీల్లో పాల్గొన్నారు.

నేడు బహుమతుల ప్రదానోత్సవం

మూడు రోజుల పాటు జరిగిన బాలోత్సవంలోని వివిధ పోటీల్లో విజేతలకు గురువారం మధ్యాహ్నం 3 గంటలకు బహుమతుల ప్రదానోత్సవం నిర్వహిస్తామని అమరావతి బాలోత్సవం నిర్వాహకులు తెలిపారు.




స్నేహం పేరుతో చీటింగ్

యువతి నుంచి 64 గ్రాముల బంగారం, రూ.33 వేలు నగదు తీసుకొని మోసం చేసిన యువకుడు

అజిత్‌సింగ్‌నగర్(విజయవాడసెంట్రల్): స్నేహం పేరుతో పరిచయమైన ఓ వ్యక్తి తన తండ్రికి ఆరోగ్యం బాలేదని నమ్మించి తన వద్ద నుంచి 64 గ్రాముల బంగారం, 33 వేల రూపాయల నగదు తీసుకొని మోసం చేశాడని ఓ యువతి అజిత్‌సింగ్‌నగర్ పోలీసులను ఆశ్రయించింది. పోలీసులు తెలిపిన వివరాల ప్రకారం.. సింగ్‌నగర్ నందమూరినగర్‌కు చెందిన యువతి ఓ ప్రైవేటు కాలేజీలో బీటెక్ రెండో సంవత్సరం చదువుతుంది. ఏడాది క్రితం పీవీపీ మాల్‌కు వెళ్లగా అక్కడ హేమంత్ మణికంఠ అనే యువకుడు పరిచయమయ్యాడు. అప్పటి నుంచి ఫోన్‌లో మాట్లాడుతూ ఉండేవాడు. ఈ ఏడాది మార్చి నెలలో ఫోను చేసిన అతను తన తండ్రికి ఆరోగ్యం బాలేదని వెంటనే డబ్బులు కావాలని చెప్పడంతో తన ఒంటిమీద ఉన్న రెండు బంగారపు చైన్లను యువతి తీసి ఇవ్వగా మరుసటి రోజు వాటిని తిరిగి ఇచ్చేశాడు. మళ్లీ కొన్ని రోజులు గడిచాక మా నాన్నకు సీరియస్‌గా ఉందని, ఐసీయూలో పెట్టారు వెంటనే డబ్బులు కావాలని ఫోను చేయగా యువతి తనకు సంబంధించిన 64 గ్రాముల బంగారం, రూ.33 వేల నగదును ఫోన్‌పే ద్వారా హేమంత్‌కు పంపింది. ఆ తరువాత బంగారం కోసం, డబ్బుల కోసం ఫోన్లు చేస్తుండగా రేపు మాపు అంటూ కాలయాపన చేస్తూ వస్తున్నాడు. నెలలు గడుస్తున్నా అతని నుంచి ఎటువంటి సమాచారం లేకపోవడంతో మోసపోయినట్లు భావించిన ఆమె పోలీసులను ఆశ్రయించింది. బాధితురాలు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.

రోడ్డు ప్రమాదానికి కారణమైన వ్యక్తికి జైలు

ఉంగుటూరు: రోడ్డు ప్రమాదం కేసులో ఓ వ్యక్తికి గన్నవరం 12వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టు సంవత్సరం జైలు, రూ.2500 జరిమానా విధించినట్లు ఎస్ఐ జి.రాజు తెలిపారు. సంభంగి లక్ష్మణరావు 2019 ఏప్రిల్ 25న తన భార్యతో కలసి మోపెడ్‌పై సత్యవోలు నుంచి తేలప్రోలు మీదుగా ఉంగుటూరు వస్తున్నారు. ఉంగుటూరు మలుపు వద్ద కొమ్మూరి గోపి సిమెంటులోడు లారీతో వేగంగా హారన్ వేయకుండా ఎదురుగా వస్తున్న ద్విచక్ర వాహనాన్ని బలంగా ఢీకొన్నాడు. ఈ ఘటనలో లక్ష్మణరావు తలకు తీవ్రగాయమై సంఘటన స్థలంలోనే మృతి చెందగా భార్య గాయపడింది. ఉంగుటూరు పోలీస్ స్టేషన్‌లో కేసు నమోదైంది. గన్నవరం 12వ అదనపు మెట్రోపాలిటన్ మేజిస్ట్రేట్ కోర్టులో వాదోపవాదనలు జరిగిన తరువాత నేరం రుజువు కావడంతో న్యాయమూర్తి శిరీష లారీ డ్రైవర్‌కు శిక్ష, జరిమానా విధించారు.

విద్యార్థుల ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు

జేసీ అపరాజిత సింగ్


ప్రతిభ చాటిన విద్యార్థికి బహుమతి అందజేస్తున్న జేసీ అపరాజిత సింగ్, డీఈఓ తాహెరా సుల్తానా

ఉయ్యూరు: విద్యార్థుల ఆలోచనలతో నూతన ఆవిష్కరణలు వెలుగులోకి వస్తాయని జాయింట్ కలెక్టర్ అపరాజిత సింగ్ అన్నారు. జిల్లా స్థాయి వైజ్ఞానిక ప్రదర్శన ఉయ్యూరులో బుధవారం నిర్వహించారు. డీఈఓ తాహెరా సుల్తానా, మున్సిపల్ చైర్మన్ వల్లభనేని సత్యనారాయణ (నాని) ప్రదర్శన ప్రారంభించారు. జిల్లా నలుమూలల నుంచి పలువురు విద్యార్థులు తాము రూపొందించిన ఆవిష్కరణలు ప్రదర్శించారు. విజేతలకు జేసీ బహుమతులు అందించారు. తహసీల్దార్ మస్తాన్, పలువురు విద్యాశాఖ అధికారులు పాల్గొన్నారు. టీచర్ల విభాగంలో ఎం.శ్యాంకుమార్ (జెడ్పీహెచ్ కపిలేశ్వరపురం), బి.వెంకట సుబ్బారావు (జెడ్పీహెచ్ పెడసనగల్లు), జి.కృష్ణమోహన్ (జెడ్పీహెచ్ తలగడదీవి) ప్రథమ, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచారు. గ్రూప్ విభాగంలో ప్రథమ స్థానంలో ఎస్.గోపాలకృష్ణ, వి.జితేంద్రనాగపవన్ (జెడ్పీ మేడూరు), ద్వితీయ స్థానంలో ఎస్.వసంతసాయి, భార్గవ్‌రామ్ (ఏఎస్ఎంపీఎల్ హైస్కూల్, గుడివాడ), తృతీయ స్థానంలో సీహెచ్ శ్రావణి, జి.రత్నకుమారి (జెడ్పీ నందివాడ), నిలిచారు. వ్యక్తిగత విభాగంలో ప్రథమస్థానంలో ఆర్‌డీ చంద్రశేఖర్ (ఎస్ఎంకే జెడ్పీ, మొవ్వ), ద్వితీయస్థానంలో కె.యుక్తామణి (జెడ్పీ, తెన్నేరు), తృతీయ స్థానంలో సీహెచ్ విశ్వనాథ్ (జెడ్పీ కంచడం, బంటుమిల్లి) నిలిచారు.